ఆక్రమణలను అడ్డుకునేది ఎవరు..?

- రోడ్లను ఆక్రమిస్తూ వెంచర్లు, పెట్రోల్ పంప్‌ల నిర్మాణం
- మైలురాళ్లను మాయం చేస్తున్న వ్యాపారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



సాగర్‌రోడ్డుపై మాల్ కేంద్రంలో వాహనాల రద్దీ

యాచారం: రోడ్డు భవనాల శాఖ మొద్దు నిద్రలో ఉంది. రోడ్డు పరిధి దాటి ఆక్రమణలు చేపడుతున్నా ఆ శాఖ పట్టించుకోవడం లేదు. ఆక్రమణలు కూల్చేయాలని ప్రయాణికులు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి నగరం నుంచి ఇబ్రహీంపటన్ం వరకు డబుల్‌లైన్ రోడ్డు ఉండగా, ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు సింగల్ రోడ్డు ఉంది. సాగర్ రోడ్డు పర్యవేక్షణ రోడ్డు భవనాల శాఖ పరిశీలిస్తోంది. సాగర్‌రోడ్డు మధ్యన నుంచి ఇరువైపులా 50 అడుగుల దూరం ఉండాలి. మొత్తం రోడ్డు వెడల్పు వంద అడుగులు. వంద అడుగుల రోడ్డులో నింబంధనల ప్రకారం ఆక్రమణలు చేయరాదు. ఒకవేళ తప్పకుంటే రోడ్డు భవనాల శాఖ అనుమతులు తప్పనిసరి. కానీ అవేమి తమకు పట్టవు అంటు కొంతమంది వ్యాపారులు, యజమానులు ఇష్టానుసారంగా రోడ్డు ఆక్రమిస్తున్నారు. నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతుంది. నిత్యం ప్రమాదాలతో ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారు. క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

ఆగని ఆక్రమణలు

సాగర్‌రోడ్డుపై వంద అడుగుల వరకు ఇరువైపులా నిర్మాణాలు చేపట్టవద్దని నింబంధనలున్నా పట్టించుకోవడం లేదు. చౌదర్‌పల్లి గేటు సమీపంలో ఓ వ్యాపారి కొత్తగా పెట్రోలు పంపు నిర్మాణం చేపడుతున్నాడు. ఆ వ్యాపారి సాగర్‌రోడ్డు బీటీ రోడ్డు పక్కన వరకు ఆక్రమించి నిర్మిస్తున్నాడు. ఈ పెంట్రోల్ పంపు యజమాని నింబంధనలు అతిక్రమిస్తున్నాడని స్థానికులు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని ఓ పెంట్రోల్ పంపు యజమాని సైతం బీటీ రోడ్డు పక్కనే ఇనుప గేట్లు పెట్టాడు. ఈ ప్రాంతాల్లో ఇదివరకే రోడ్డు ఇరుకుగా ఉంది. ఆ పై ఆక్రమణలు చేపట్టడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలుమార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. ఇబ్రహీంపట్నం, ఆగాపల్లి, గునుగల్, యాచారం, మాల్ కేంద్రాల్లోనూ రోడ్డుపైనే వాహనాల పార్కింగ్, అక్రమ నిర్మాణాలతో రోడ్డు వెడల్పు చేసినా ఇరుకుగానే మారింది. ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యాపారులు మైలురాళ్లను సైతం మాయం చేస్తున్నారు.

పెరిగిన రద్దీ

సాగర్‌రోడ్డుపై వాహనాల రాకపోకల రద్దీ భారీగా పెరిగింది. నిత్యం ఈ రోడ్డుపై ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన వీఐపీలు, వీవీఐపీలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డుపై ఇరు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు నల్గొండ, దేవరకొండ, మాచర్ల, మార్కాపురం, కనిగిరి, పొదిలి. గుంటూరు, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో సాగర్‌రోడ్డు రద్దీగా ఉంటుంది. ఒక్కో సారి మాల్, యాచారం, ఇబ్రహీంపట్నం కేంద్రాల్లో రోడ్డు దాటేందుకు కూడా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల కిందటే సీఎం కేసీఆర్ ప్రభుత్వం సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాల రద్దీని సర్వే చేయించింది. సర్వే చేసిన ఆర్‌అండ్‌బీ శాఖ, ఓ ప్రవేట్ సర్వే సంస్థ సాగర్‌రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మరమ్మతులు చేయాలని సర్కార్‌కు నివేదిక అందజేసింది. కానీ నేటికీ అమలుకు నోచుకోవడం లేదు.

రోడ్డు వెడల్పు మరింత పెంచాలి



సాగర్‌రోడ్డు పూర్తిగా వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. తుర్కయంజాల్ నుంచి యాచారం రావడానికి 40 నిమిషాల సమయం పడుతుంది. తరుచూ ఈ రోడ్డుపై వీవీఐపీల వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. సాగర్‌రోడ్డు మరింతా వెడల్పు చేయాల్సిన అవసరం ఉంది. పోలీస్ శాఖ తరుచూ తనిఖీలు చేస్తుండాలి.

– పాశ్శ భాషా, ప్రయాణికుడు, నక్కర్తమేడిపల్లి

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం



సాగర్‌రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల దూరం తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి. రోడ్డు పక్కనే ఆక్రమణలు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. సాగర్‌రోడ్డుపై కొన్ని చోట్ల పెట్రోల్ పంపుల యజమానులు రోడ్డు అక్రమిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. తమ పరిశీలనలో నిజమని తేలితే వాటిని తొలగించి కేసులు నమోదు చేస్తాం, రోడ్డు భవనాల శాఖ పరిధిలోని స్థలాలకు అనుమతులు తప్పక తీసుకోవాలి.

– శ్రీహరి, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, ఇబ్రహీంపట్నం డివిజన్

రోడ్డుపై పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు



సాగర్‌రోడ్డుపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. అందుకే నిత్యం సాగర్‌రోడ్డుపై అతి వేగం , నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకుండా తరుచూ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నాం. గునుగల్, మాల్, యాచారం కేంద్రాల్లో సాగర్‌రోడ్డుపై అక్రమ నిర్మాణాలు చేపట్టినా.. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసినా కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తాం.

– లింగయ్య, సీఐ యాచారం

నేడు ఫైనల్ పోటీలు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ఫైనల్‌కు చేరుకున్నాయని పీఈటీ మల్లేశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ టీంలో పడకల్, దేవుని పడకల్ టీంలు, కబడ్డీలో కర్కాస్‌తండా, తలకొండపల్లి టీంలు, ఖోఖోలో వెల్జాల్, గట్టుఇప్పలపల్లి టీంలు ఫైనల్‌కు చేరుకున్నాయన్నారు. బుధవారం ఈ టీంలు ఫైనల్‌లో తలపడనున్నాయని.. విజేతలతో పాటు, మెళకువలు, నైపుణ్యం, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పీఈటీ తెలిపారు.

శాశ్వత వంతెన నిర్మించండి



పెద్ద చెరువు అలుగుపై దీక్ష చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు అలుగుపై శాశ్వత వంతెన నిరిమ్ంచాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. పనులు త్వరగతిన చేపట్టాలని కోరుతూ ఏడు రోజులుగా ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై దీక్షలు చేస్తున్నారు. మంగళవారం ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేశ్, వెంకటేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

30 రోజులకు చేరిన వీఓఏల సమ్మె

తలకొండపల్లి: మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 30 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీసం వేతనం రూ.26 వేలు, ఉద్యోగ భద్రత, ఇవ్వాలని వీఓఏలు డిమాండ్ చేశారు. నిరంతరంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు నర్సింహ, మానస, రాణి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాయినగర్ కాలనీవాసులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ 8వ వార్డు శ్రీ సాయినగర్ కాలనీలో మౌలిక వసతులను కల్పించాలని కోరుతూ కాలనీ వాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 18, 19లోని మా కాలనీలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దశల వారీగా తాగు నీటి సరఫరా, సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కస్తూరి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి శ్రీను, కార్యవర్గ సభ్యులు లింగస్వామి, చందునాయక్, అఖిల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం




కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. లయన్స్‌క్లబ్ కోశాధికారి కొండల్‌రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. నేత్ర వైద్యుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ఇందులో 33 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం మహబూబ్‌నగర్ లయన్స్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రామ్మోహన్, పాషా, మోహన్ రెడ్డి, రాంరెడ్డి, పీఆర్‌ఓ పాషా ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు



ఉపాధ్యాయులను సన్మానించి విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న వెంకటేశ్వర్లు

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన నందివనపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉత్తమ గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులకు రూ.10వేల చొప్పన నగదు బహుమతులు అందజేసి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రోత్సహిస్తే మరింత కష్టపడి చదువుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమావత్ కిషన్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, బోజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



పెంటయ్య(ఫైల్)

హస్తినాపురం: వ్యక్తి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పాంపురం గ్రామానికి చెందిన 30 మంది మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి నర్సింహారావునగర్ కాలనీలో గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వీరిలో మండ్ల పెంటయ్య (50) అనే వ్యక్తి ఈనెల 13న పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉండగా, భార్య ముత్యాలమ్మ కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం ఆమె తిరిగి వచ్చే సరికి పెంటయ్య కనిపించలేదు. దీంతో భార్య తన భర్త ఆచూకీ కోసం స్థానికులను, బంధు,మిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాసబ్ చెరువును కాపాడండి



ఎమ్మెల్యేతో అఖిలపక్ష నాయకులు

ఎమ్మెల్యేకు అఖిల పక్ష నాయకుల వినతి

తుర్కయంజాల్: మాసబ్ చెరువును పరిరక్షించాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు మంగళవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సర్వే నెంబర్ 205లో చెరువు నీటిలో డంప్ చేసిన మట్టిని తొలగించి చెరువు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ నాయకులు, మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జూన్ 2న హైకోర్టు తీర్పు ఉన్నందున అప్పటి వరకు వేచి చూద్దామన్నారు. చెరువు సర్వే కోసం కలెక్టర్ హెచ్‌ఎండీఏకు లేఖ రాసారని చెప్పారు. మట్టి లారీలు వెళ్లకుండా ఉండేలా కందకం తీయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. చెరువులో మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే రూ.42కోట్ల నిధులను కేటాయించామని, రెండవ విడతలో ఎస్టీపీ పనులు ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.

సహోద్యోగుల ఆర్థికసాయం

అబ్దుల్లాపూర్‌మెట్: అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి సహోద్యోగులు రూ.1.34లక్షల ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని గండిచెరువు గ్రామానికి చెందిన పూజారి శంకర్‌గౌడ్ హయత్‌నగర్–2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. దీంతో డిపోలో ఆయనతో పనిచేసిన కార్మికులంతా కలిసి మృతుడి కుటుంబానికి రూ.1.34లక్షల నగదును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు బొల్లేపల్లి శెట్టయ్యగౌడ్, శ్రీనివాస్, ఎరుకల నర్సింహగౌడ్, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్: మృతుడి భార్యకు నగదును అందజేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలికి చెందిన రాములమ్మ అనారోగ్యంతో (56) సోమవారం రాత్రి మరణించింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డి సేవా సమితి మండల ఉపాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రేణురెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2,500, రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, రాములు, యాదయ్య, పవన్ వాల్మీకి, రాజేందర్, పాండు, మల్లేశ్, జంగయ్య, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనకు సహకరించాలి



డెంగీ అవగాహన ర్యాలీలో వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధరణికుమార్

మంచాల: డెంగీ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధరణి కుమార్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ డెంగీ డే సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధరణి కుమార్ మాట్లాడుతూ.. 2030 వరకు డెంగీ నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఇందులో ప్రజా భాగస్వామ్యమే ప్రధానమన్నారు. దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటితో తోక పురుగులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్ రెడ్డి, కిరణ్ ప్రసాద్, డివిజన్ ఉప మలేరియా అధికారి ఎం.హేమ్‌లాల్, హెల్త్ ఎడ్యుకేటర్ పి.శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పట్నం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: ఇబ్రహీంపట్నం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని.. ఇందుకు గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పని చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మల్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేలలా అండగా ఉంటామని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి న బీఆర్‌ఎస్ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టం చేయాలన్నారు. కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, రాష్ట్ర నాయకులు చిలుక మదుసూధన్‌రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతు, కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయ కులు ఆర్.వెంకటేశ్వర్లు, మల్లేశ్, ప్రేమాకర్‌రెడ్డి, సంజీవ, బుగ్గరాములు, ఎంపీటీసీ సభ్యులు నరేందర్‌రెడ్డి, జయానందం, మండల కో ఆప్షన్ సభ్యుడు వాజీద్, పీఏసీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రావు, పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హస్తినాపురం: హోటల్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని సురభి హోటల్‌లోని రెస్టారెంట్‌లోని రూమ్ నంబర్ 410లో పేకాటాడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు , వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. పేకాటాడుతున్న అనిల్‌కుమార్, రామాంజనేయులు, హరీష్, వెర్మరాజు, నాగరాజులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.36,780 నగదు, ఐదు సెల్‌ఫోన్లు , ఒక సెట్ పేకలు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా విదేశీ మద్యం సరఫరా

- ఐదుగురి అరెస్టు
- 159 బాటిళ్ల స్వాధీనం

దిల్‌సుఖ్‌నగర్: అక్రమంగా విదేశీ మద్యం సరఫరా చేస్తున్న ఐదుగురిని జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సరూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వివిధ బ్రాండ్లకు చెందిన 159 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఆర్‌కేపురంలోని సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య విలేకరులకు తెలిపిన ప్రకారం.. అల్మాస్‌గూడ నివాసి సంరెడ్డి రవికాంత్‌రెడ్డి అనుమతి లేకుండా విదేశీ మద్యంను సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి 9 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. రవికాంత్ రెడ్డిని అందుపులోకి తీసుకుని విచారించగా, తాను ఆదిభట్లకు చెందిన శ్రీవీర్‌గౌడ్ వద్ద నుంచి కొనుగోలు చేశానని చెప్పారు. పోలీసులు శ్రీవీర్‌గౌడ్ అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 12 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు విచారణలో అతడు అల్మాగూడకు చెందిన వెంకన్న దగ్గర కొనుగోలు చేశానని చెప్పడంతో పోలీసులు వెంకన్న నివాసంపై దాడి చేయగా 54 విదేశీ మద్యం సీసాలు దొరికాయి. విచారణలో అతడు తాను కాప్రాకు చెందిన సాయికిరణ్‌కుమార్, నాగరాజుల దగ్గర మద్యం సీసాలు కొనుగోలు చేశానని చెప్పాడు. దీంతో పోలీసులు సాయికిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి అతడి వద్ద 84 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా, తిరుమలగిరికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశానని చెప్పాడు. అతను సీఎస్‌డీ క్యాంటీన్ నుంచి తెచ్చి ఇతరులకు సరఫరా చేస్తున్నానని తెలిపారు. అధికారు ఐదుగురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రైతుల అభివృద్ధికే ‘సహకారం’



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

డీసీసీబీ వైస్ ఛైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: రైతుల అభివృద్దే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం సత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా 25 మందిని సభ్యులుగా చేర్చుకున్నామని, 45 మంది రైతులకు రూ.3.75లక్షల అప్పులు మంజూరు చేశామని చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కలను ఆమోదించామని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవ రెడ్డి, చాపల యాదగిరి, నర్సింగ్ రావు, కృష్ణా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, భార్గవి, సీఈఓ వై.రాందాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే చర్యలు

ట్రాన్స్‌జెండర్లకు సీఐ కౌన్సెలింగ్



ట్రాన్స్‌జెండర్ల సూచనలు ఇస్తున్న సీఐ మన్మోహన్

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రజలకు ఇబ్బంది కల్గించే విధంగా ప్రవర్తిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ మంగళవారం ట్రాన్స్‌జెండర్లను హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఎస్ఐ మన్మథకుమార్‌తో కలిసి ట్రాన్స్‌జెండర్లు, వారి నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాల గురించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు నూతన గృహ ప్రవేశాలు, దుకాణాల ప్రారంభోత్సవాలతో పాటు వ్యక్తుల వద్ద నుంచి బలవంతంగా డబ్బులు వసూళ్లు చేయవద్దని సూచించారు. రహదారుల వెంట అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించకూడదని. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదకరంగా వాటర్ వాల్వ్



తొర్రూర్‌లోని వడ్డెర బస్తీలో తాగునీటి పైపు వాల్వ్ రోడ్డు లెవల్ కంటే పైకి ఉండడంతో ప్రమాదకరంగా మారింది. అటుగా ప్రయాణిస్తున్న వాహనాలు తరుచుగా ప్రమాదాలు బారినపడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వాల్వ్‌ను రోడ్డు మధ్యనుంచి తప్పించాలని కోరుతున్నారు. – హయత్‌నగర్